క్లుప్తంగా

గోశాలలకు రాజన్న కోడెలు



కోడెలను అందజేస్తున్న ఆలయ అధికారులు

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లోని రాజన్న గోశాలలోని కోడెలను జనగామ. వరంగల్ జిల్లాలలోని గోశాలలకు మంగళవారం అందజేశారు. జనగామ జిల్లా దేవరుప్పాల మండలం పడమటి తండకు చెందిన పరమేశ్వర గోశాలకు 20 కోడెలు. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం జయరంతండాకు చెందిన శివపార్వతీ గోశాలకు 20 కోడెలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిరుపేదలకు డబుల్ బెడ్రూంలు ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వీర్నపల్లి: నిరుపేదలకు, కార్మికులకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహం నుంచి ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మూషం రమేశ్ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఒక్క డబుల్ బెడ్రూం నిర్మాణం కూడా పూర్తి కాలేదన్నారు. వేల సంఖ్యలో నిరుపేదలు ఉండగా వందల సంఖ్యలో ఇళ్లు ఇస్తే ఎలా అని ప్రశ్నించారు. మండలంలో 400 ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాసంఘాల పోరాట వేదిక నాయకులు మల్లారపు అరుణ్‌కుమార్, నరేందర్, దేవయ్య, రాజం, నర్సయ్య, దినేశ్, శంకర్, రాజఎల్లయ్య, దేవదాస్ పాల్గొన్నారు.

కంటి వెలుగు కేంద్రం ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలోని 19వ వార్డులోని అంబేడ్కర్ భవనంలో కంటి వెలుగు కేంద్రాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యాధికారి నీరజ, కౌన్సిలర్ కుమరి శిరీష పాల్గొన్నారు.

రామచంద్రాపూర్ గ్రామంలో

తంగళ్లపల్లి: మండలంలోని రామచంద్రాపూర్ గ్రామంలో నేరెళ్ల పీహెచ్‌సీ మెడికల్ అధికారి జిందం రేఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ పడిగెల మానస ప్రారంభించారు. సర్పంచ్ స్రవంతి, ఎంపీటీసీ కళ, నాయకులు బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు మోర నిర్మల పాల్గొన్నారు.

పక్కా భవనాలు లేని పంచాయతీలు

- నిధులు మంజూరైనా మొదలుకాని పనులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజాప్రతినిధులు



పై ఫొటోలో కనిపిస్తున్నది రాజన్న గొల్లపల్లి ప్రాథమిక పాఠశాలలోని వంట గది. నూతనంగా ఏర్పాటైన గ్రామపంచాయతీకి భవనం లేకపోవడంతో ఈ వంటగదినే గ్రామపంచాయతీ కార్యాలయంగా మార్చారు. నాలుగేళ్ల నుంచి ఇదే రేకుల షెడ్డులో నిర్వహిస్తున్నారు. సొంత భవనానికి నిధులు మంజూరైనట్లు ప్రకటించినా పనులింకా ప్రారంభం కాలేదు.



శిథిలావస్థకు చేరుకున్న మరిమడ్ల గ్రామపంచాయతీ కార్యాలయం



పై ఫొటోలో కనిపిస్తున్నది కొత్తగా ఏర్పడిన కమ్మరిపేట తండా గ్రామపంచాయతీ భవనం. ఈ గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైన సూర్యానాయక్ తన ఇంట్లో ఉన్న కిరాణా దుకాణాన్ని ఖాళీ చేసి గ్రామపంచాయతీ కార్యాలయంగా మార్చాడు. సొంత భవనానికి నిధులు మంజూరైనట్లు చెబుతున్నా పనులు మాత్రం మొదలు కాలేదు.

కోనరావుపేట: పల్లెలకు కేంద్ర బిందువైన పంచాయతీ కార్యాలయాలకు పక్కా భవనాలు కరువయ్యాయి. అద్దె భవనాలు, పాఠశాల, సంఘ తదితర భవనాల్లో పంచాయతీ కార్యాలయాలను నిర్వహిస్తున్నారు. మండలంలో కొత్తగా ఏర్పాటైన పల్లెలకు గ్రామపంచాయతీ భవనాలు కరువయ్యాయి. వీటితో పాటు పాత గ్రామాల్లో కూడా పంచాయతీ భవనాలు శిథిలావస్థకు చేరుతున్నాయి.

కోనరావుపేట మండలంలో మొత్తం 21 గ్రామాలు ఉండేవి. కొత్తగా ఏర్పాటైన తండాలతో కలిసి మొత్తం 28 గ్రామపంచాయతీలయ్యాయి. ఎక్కువ గ్రామాల్లో పంచాయతీ భవనాలు లేవు. కొన్ని గ్రామాల్లో శిథిలావస్థకు చేరుకోగా మరికొన్ని పంచాయతీలు అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు.

కొత్త పంచాయతీల్లో తిప్పలు

కొత్త గ్రామపంచాయతీల్లో భవనాలకు తిప్పలు తప్పడం లేదు. ఈ పంచాయతీలను అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు.

➡ కమ్మరిపేట(వట్టిమల్ల) గ్రామపంచాయతీకి భవనం లేకపోవడంతో సర్పంచ్ మాలోత్ సూర్య ఇదివరకు తన ఇంటి ముందు కిరాణా దుకాణం నడుపుకుంటున్న గదిని ఖాళీ చేసి గ్రామపంచాయతీ భవనంగా మార్చుకున్నాడు.

➡ జై సేవాలాల్ భుక్యా రెడ్డి తండాలో నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ భవనాన్ని పంచాయతీ భవనంగా మార్చుకున్నారు.

➡ రాజన్న గొల్లపల్లి(కొలనూర్)లో అయితే ప్రాథమిక పాఠశాలలోని వంటగదిలో గ్రామపంచాయతీ కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు.

➡ గోవిందరావుపేటతండా(బావుసాయిపేట) అయితే మూతబడ్డ పాఠశాల భవనంలో కొనసాగిస్తున్నారు.

➡ గొల్లపల్లి(వట్టిమల్ల)లో యాదవ సంఘ భవనంలో, అజ్మీరాతండా(వట్టిమల్ల), జై సేవాలాల్ ఊరుతండా(నిమ్మపల్లి) గ్రామాల్లో సంఘ భవనాల్లో కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు.

నాలుగేళ్లు పూర్తి

సర్పంచులుగా ఎన్నికై ఈ జనవరికి నాలుగేళ్లు పూర్తయినా కానీ భవనాలే కరువయ్యాయి. మండలంలోని చాలా గ్రామాల్లో ఇది వరకు నిర్మించిన గ్రామపంచాయతీ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మండలంలోని మరిమడ్ల, వట్టిమల్ల, ధర్మారం, కొలనూర్, సుద్దాల, పల్లిమక్త, నాగారం

➡ కొండాపూర్, శివంగాలపల్లి, కోనరావుపేట గ్రామాల్లో పంచాయతీ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. తమ హయాంలో నూతన గ్రామ పంచాయతీ భవనాలను నిర్మిస్తే గుర్తింపు లభిస్తుందని తొలి సర్పంచులు భావిస్తున్నారు. తమ గ్రామాలకు నూతన భవనాలను మంజూరు చేయాలని కోరుతున్నారు.

ముందుకు రాని కాంట్రాక్టర్లు

పంచాయతీలకు రూ.20 లక్షల చొప్పున మంజూరైనా పనులు చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. గతంలో చేసిన పనులకు బిల్లులు సక్రమంగా రాకపోవడంతో మళ్లీ ఈ పనులు చేస్తే ఎలా వస్తాయోనని ఆందోళన చెందుతున్నారు.

శిథిలావస్థలో భవనాలు



నూతనంగా ఏర్పాటైన గోవిందరావుపేట గ్రామపంచాయతీకి సొంత భవనం లేదు. తాత్కాలికంగా పాఠశాల గదిలో గ్రామపంచాయతీని నిర్వహిస్తున్నాం. పంచాయతీ కార్యకలాపాలు నిర్వహించుకోవడం ఇబ్బందిగా మారింది. పంచాయతీ సొంత భవనానికి రూ.20 లక్షలు ఉపాధి హామీ పథకంలో మంజూరయ్యాయి. త్వరలోనే పనులు చేయాలని అనుకుంటున్నాం.

– గుగులోత్ రజిత, గోవిందరావుపేట సర్పంచ్

ఎప్పుడు కూలుతాయో తెలియదు



మరిమడ్లలో గతంలో నిర్మించిన గ్రామపంచాయతీ భవనం శిథిలావస్థకు చేరుకుంది. గోడలు పగుళ్లు బారుతున్నాయి. వర్షాలకు కురిసినప్పుడు ఉరుస్తుండడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. పంచాయతీ భవనాలకు నిధులు మంజూరయ్యాయని అన్నారు. పనులు త్వరగా చేస్తే బాగుంటుంది.

– మాట్ల అశోక్, మరిమడ్ల సర్పంచ్

నిధులు మంజూరయ్యాయి



మండలంలోని 15 గ్రామపంచాయతీలకు పక్కా భవనాలు నిర్మించేందుకు ఉపాధి హామీ పథకంలో నిధులు మంజూరయ్యాయి. ఒక్కో గ్రామపంచాయతీ భవనానికి రూ.20 లక్షల చొప్పున వచ్చాయి. ఇంకా పనులు ప్రారంభం కాలేదు. గ్రామపంచాయతీ తీర్మానంతో పనులు చేసుకోవచ్చు. అన్ని గ్రామాల్లో త్వరలోనే పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– మనోహర్, ఏఈ, పంచాయతీరాజ్

సేవా దృక్పథంతో ఉచిత మెగా వైద్యశిబిరం



మాట్లాడుతున్న చెన్నమనేని వికాస్‌రావు

చందుర్తి ఆర్థిక స్థోమత లేని వారికి ఉచిత వైద్య పరీక్షలు చేయాలని సేవా దృక్పథంతోనే గ్రామాల్లో ఉచిత మెగా వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ప్రతిమ ఫౌండేషన్ చైర్మన్ చెన్నమనేని వికాస్‌రావు అన్నారు. మండలంలోని నర్సింగపూర్ జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో మంగళవారం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజ నిర్ధారణ యంత్రాలను ప్రజల వద్దకు తీసుకువెళ్లేందుకు రూ.5 కోట్లతో ఆరోగ్య రథం ఏర్పాటు చేశామన్నారు. డాక్టర్ దీప మాట్లాడుతూ మహిళలు రొమ్ము క్యాన్సర్, బాలికలు ఐరన్ లోపంతో బాధపడుతున్నారని, వాటిని అధిగమించేందుకు వైద్య సూచనలు, సలహాలు తీసుకుని ఆ లోపాన్ని నివారించుకోవాలన్నారు. ఈ మెగా శిబిరంలో 663 మంది పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగం కుమార్, ఆశిరెడ్డిపల్లె సర్పంచ్ అంచా సుమా, నర్సింగపూర్ ఉపసర్పంచ్ కాసారపు శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ అంచా శ్రీహరిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పరిహారం అందజేత

తంగళ్లపల్లి: ఇటీవల పొలానికి నీళ్లు పెడుతూ కరెంట్ షాక్‌తో మృతిచెందిన మండలంలోని అంకుషాపూర్ గ్రామానికి చెందిన కునవేని పర్శరాములు భార్య నవ్యకు సెస్ నుంచి మంజూరైన పరిహారాన్ని చైర్మన్ చిక్కాల రామారావు మంగళవారం అందజేశారు. పరిహారంలో భాగంగా రూ.4.50 లక్షలు బాండ్, రూ.50 వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పడిగెల మానస, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, సర్పంచ్ ఎల్లవ్వ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజన్న, సింగిల్‌విండో చైర్మన్ దేవదాస్ గౌడ్, వైస్ చైర్మన్ రమణారెడ్డి, ఏఈ ప్రశాంత్, నాయకులు పాల్గొన్నారు.

చిత్రకథ



రోడ్డు వేశారు.. సైడ్ బర్మ్స్ మరిచారు

వేములవాడరూరల్: ప్రభుత్వ అభివృద్ధి పనులు పూర్తి చేయడంలో కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారనే ఆరోపణలున్నాయి. వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని శాత్రాజుపల్లి వార్డులో నూతనంగా రోడ్డు పోసిన కాంట్రాక్టర్ ఇరువైపులా సైడ్ బర్మ్స్ పోయాల్సి ఉండగా పోయకుండానే వదిలిపెట్టాడు. లక్షల రూపాయల పనులు చేసి బిల్లులు తీసుకుంటున్నా పూర్తిస్థాయిలో పనులు చేయకపోవడంతో వార్డు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సమాచారం

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్లఅర్బన్: సాంఘికం సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2023–24 విద్యా సంవత్సరంలో ఐదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ గురుకులాల సమన్వయ అధికారిణి బి. జాక్వలిన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 6 సాంఘిక సంక్షేమ పాఠశాలలు ఉన్నాయని, 2022–23 సంవత్సరంలో నాల్గో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. మార్చి 6లోపు సంబంధిత ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఏప్రిల్ 23న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. మిగతా వివరాలకు హెల్ప్‌లైన్ నెంబర్ 180042545678 నెంబర్‌ని సంప్రదించాలని ఆమె కోరారు.

ఉగాది కవి సమ్మేళనం

సిరిసిల్లకల్చరల్: ఉగాది పర్వదినం సందర్భంగా జిల్లా రచయితల సంఘం సారథ్యంలో ఉగాది కవి సమ్మేళనం ఏర్పాటు చేయనున్నట్లు సంఘం అధ్యక్షుడు ఎలగొండ రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కవి సమ్మేళనంలో కవితలు సామాజిక అభ్యుదయాన్ని ఆకాంక్షిస్తూ, 20 పంక్తులకు మించకుండా ఉండాలన్నారు. ఎంపిక కమిటీ తీర్మానించిన మేరకు కవితల పఠనానికి అవకాశం ఉంటుందన్నారు. ఆసక్తి గల కవులు తమ కవితలను మార్చి 15 లోపు పంపించాలన్నారు. పూర్తి వివరాల కోసం 98487 70345 సెల్ నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నీటి సరఫరాలో అంతరాయం

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల పట్టణ పరిధిలో బుధవారం నుంచి మూడు రోజులు పాటు మంచినీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సిరిసిల్ల–కరీంనగర్ ప్రధాన రహదారి చంద్రంపేట వద్ద మెయిన్ పైప్‌లైన్ లీకేజీ మరమ్మతుల వల్ల నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలను చూసుకోవాలని కోరారు.

ప్రజాగోస-బీజేపీ భరోసా



గండిలచ్చపేటలో స్ట్రీట్ కార్నర్‌లో నాయకులు

సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గణేశ్‌నగర్‌లో, వీర్నపల్లి మండలంలోని అడవి పదిర, బోయినపల్లి మండలం అనంతపల్లి, కోనరావుపేట మండలం ధర్మారంలో, తంగళ్లపల్లి మండలం గండిలచ్చపేట, ఇల్లంతకుంట మండలంలోని దాచారం, ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామాల్లో బీజేపీ ఆధ్వర్యంలో స్ట్రీట్ కార్నర్ సమావేశాలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలను వివరించారు. రాష్ట్రాన్ని ఎనిమిదేళ్ల కాలంలో తెలంగాణ ప్రభుత్వం రూ.40 వేల కోట్ల అప్పుల్లో ఉంచిందన్నారు. మోదీ హయాంలో 23 రాష్ట్రాల్లో 24 గంటలు విద్యుత్ సరఫరా చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు యూరియా, దుక్కి మందు, డీఏపీ ఎరువులను రైతులకు సబ్సిడీపై అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిబోయిన గోపి, జిల్లా కార్యదర్శి గోపాడి సురేందర్‌రావు, బీజేపి జిల్లా ఉపాధ్యక్షుడు శీలం రాజు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మిర్యాల్‌కార్ బాలాజీ, బీజేపీ మండల అధ్యక్షులు దేవేందర్‌రెడ్డి, గుడి రవీందర్‌రెడ్డి, గొట్టె రామచంద్రం, సురువు వెంకట్, బెంద్రం తిరుపతిరెడ్డి బీజేపీ సిరిసిల్ల పట్టణాధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, శక్తి కేంద్రం ఇన్‌చారిలు, బూత్ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్

ప్రతిపాదనలతో సరి

- కలగా మారుతున్న కల్వర్టుల నిర్మాణం
- యేటా ప్రజలకు తప్పని తిప్పలు



మల్కపేట ఒర్రె వద్ద వాహనదారుల ఇబ్బందులు (ఫైల్)

కోనరావుపేట: మండలంలోని పలు గ్రామాల మధ్య ఉన్న ఒర్రెలు ప్రమాదకరంగా ఉన్నాయి. వర్షాకాలం వస్తే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని, ఈ ప్రాంతంలో కాజ్‌వేలు నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపినా అవి కార్యరూపం దాల్చడంలేదు. కోనరావుపేట మండలంలోని మల్కపేట, ధర్మారం, కోనరావుపేట, వట్టిమల్ల, కొండాపూర్ తదితర గ్రామాలకు వెళ్లే దారిలో ఒర్రెలు ఉన్నాయి. ప్రతీ సంవత్సరం వర్షాలు కురిసి ఒర్రెలు పొంగి పొర్లుతున్నాయి. దీంతో అన్ని గ్రామాల ప్రజలు, వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. మల్కపేట గ్రామంలో రెండు ఒర్రెలు, ధర్మారం గ్రామంలో ఒకటి ఉన్నాయి. వీటితో పాటు వట్టిమల్లకు వెళ్లే ప్రధాన రహదారిపై ఒర్రెలున్నాయి.

ప్రతిపాదనల్లోనే పనులు

మండలంలోని గ్రామాల్లో ఉన్న ఒర్రెలతో మండల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలంలో నీటితో ఉంటున్న మండలంలోని పలు గ్రామాల్లోని ఒర్రెల వద్ద నిర్మించతలపెట్టిన కాజ్‌వేల కోసం మండల ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రతిపాదనలు తయారు చేసి పంపించారు. ఒక్కో ఒర్రె వద్ద కాజ్‌వే నిర్మించేందుకు సుమారు రూ.20 లక్షల పైనే ఖర్చు అవుతుంది. నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపించి ఏడాదవుతోంది. కానీ ఇప్పటి వరకు ఒక్క పనికి కూడా నిధులు మంజూరు కాలేదు. ఒక్క కోనరావుపేట మండల కేంద్రంలో కల్వర్టుకు రూ.32 లక్షల నిధులు వచ్చినా పనులు అంతంతమాత్రంగా సాగుతున్నాయి. దీంతో కోనరావుపేట మండల కేంద్రానికి వచ్చే ప్రజలు, సిరిసిల్లకు వెళ్లే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



వర్షాలు ఎక్కువైతే సిరిసిల్ల–కోనరావుపేట ప్రధాన రహదారిపై రాకపోకలు స్తంభిస్తున్నాయి. అధికారులు, ప్రజలు ప్రతీ సంవత్సరం ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి రహదారి సమస్యను పరిష్కరించాలి.

–షేక్‌ఫిరోజ్ పాషా, కాంగ్రెస్ అధ్యక్షుడు

నిధులు మంజూరు కాలేదు

కొండాపూర్ స్టేజీ వద్ద ఒకటి, కోనరావుపేట శివారులో మరో ఒర్రె ఉంది. మిగతా గ్రామాల్లో రహదారిపై ఉన్న ఒర్రెలపై కాజ్‌వేలకు నిధులు మంజూరు కోసం ఇదివరకే ప్రతిపాదనలు పంపించాం. వీటికి నిధులు మంజూరైతే పనులు ప్రారంభించేలా చూస్తాం.

–సతీశ్, ఏఈ, ఆర్అండ్‌బీ

ఘనంగా మాతృ భాషా దినోత్సవం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్

సిరిసిల్లకల్చరల్: అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం సందర్భంగా డాక్టర్ సతీష్‌కుమార్ రచించిన పిల్లల కథల పుస్తకం 'బహుమతి'ని మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కనకశ్రీ విజయ రఘునందన్ ఆవిష్కరించి మాట్లాడారు. అధ్యాపకులు వాసరవేని పరశురాం, చెన్నోజుల శేఖర్, అజ్మీర చంద్రశేఖర్, కందాల కార్తీకరెడ్డి, నీరటి విష్ణుప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండలం ఓబులాపూర్ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. హెచ్‌ఎం బండి ఉపేందర్ తెలుగు ఉపాధ్యాయిని పద్మ, కూతురి కరుణాకర్‌రెడ్డి, గుండెల్లి రవీందర్, పలుమారు తిరుపతి, గాజంగి కీర్తి, పట్టెం పద్మ, భీమనాతిని శ్రీలత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలం రాచర్లబొప్పాపూర్‌లోని జ్ఞానదీప్ పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో ప్రిన్సిపాల్ రిన్సీ మాట్లాడారు.

వీఓఏలకు కనీస వేతనాలు ఇవ్వాలి

ముస్తాబాద్: ఇందిరా క్రాంతిపథంలో ఇరవై ఏళ్లుగా పనిచేస్తున్న వీఓఏలకు కనీస వేతనాలు ఇవ్వాలని కోరుతూ డీఆర్‌డీవోకు వినతిపత్రం మంగళవారం అందజేసినట్లు వీఓఏల సంఘం ప్రతినిధి కోల విజయ తెలిపారు. వీఓఏలకు కనీస గౌరవ వేతనంగా రూ.18 వేలు ఇవ్వాలని, ఆరోగ్య కార్డులు ఇవ్వాలని, అర్హులైన వీఓఏలను సీసీలుగా నియమించాలని కోరారు. మహిళా సంఘాల గ్రేడింగ్‌తో నిమిత్తం లేకుండా వీఓఏలకు వేతనాలు ఇవ్వాలన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో మంగళవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎంపీపీ పిల్లిరేణుక పంపిణీ చేశారు.

లబ్ధిదారులకు చెక్కులు..

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లతిమ్మాపూర్ గ్రామంలో మంగళవారం వివిధ పథకాల ద్వారా లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, సర్పంచ్ రవీందర్, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల అంతర్గత మార్కుల పరిశీలన

ఇల్లంతకుంట: మండలంలోని కందికట్కూర్, పెద్దలింగాపూర్, వెల్జిపూర్, పొత్తూరు గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ హైస్కూళ్లలో పదో తరగతి విద్యార్థుల అంతర్గత మార్కులను అబ్జర్వర్ సుంకపాక ప్రభావతి పరిశీలించారు.

పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

సిరిసిల్లఅర్బన్: జిల్లా కేంద్రంలో జ్యోతిరావుపూలే సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఏర్పాటు చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ కంచర్ల రవిగౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం బీసీ విద్యార్థి సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. నాయకులు ప్రకాశ్, రంగు దినేశ్, బడుగు వినయ్, శ్రేయజ్, మహేశ్, కార్తీక్, రాజ్‌కుమార్, మహేశ్, దేవేందర్, అనిల్ పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

ముస్తాబాద్: మండలం పోతుగల్‌లో మండల పరిషత్ నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను సర్పంచ్ తన్నీరు గౌతంరావు మంగళవారం ప్రారంభించారు. జెడ్పీటీసీ గుండం నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ప్యాక్స్ చైర్మన్ తన్నీరు బాపురావు, మాజీ ఎంపీపీ అక్కరాజు శ్రీనివాస్, విజయరామారావు, ఎంపీటీసీ బాలకిషన్, ఉపసర్పంచ్ మంజుల పాల్గొన్నారు.